క్లుప్తంగా

కొండలమ్మకు పాల పొంగళ్ల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి అధికసంఖ్యలో భక్తులతో ఆదివారం సందడిగా మారింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వెంకన్నను దర్శించుకున్న భక్తులు



గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. స్వామివార్లకు వేద పండితులు విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ



మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరం వైఎస్సార్ సీపీ నాయకుడు బొబ్బిలి రత్తయ్యనాయుడు మాతృమూర్తి సీతామహలక్ష్మి పెద్ద కర్మ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, మాజీ మంత్రి పేర్ని నానితో కలిసి ఆదివారం పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, బీసీ విభాగ కార్యదర్శి బలే నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు చేబోయిన వీర్రాజు, ఎస్.థామస్, బి.యేసోబురాజు పాల్గొన్నారు.

రంగా విగ్రహాల ఆవిష్కరణ



ముదినేపల్లి రూరల్: మండలంలోని ఈడేపల్లిలో వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఆయన కుమారుడు రాధాకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. గ్రామ మాజీ సర్పంచ్ దివంగత బండి వెంకన్నబాబు విగ్రహాన్ని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ రంగా వ్యక్తి కాదని మహాశక్తి అని పేర్కొన్నారు. కుల మతాలకు అతీతంగా పేదల పక్షాన పోరాటం చేసిన యోధుడిగా అభివర్ణించారు. విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా ముదినేపల్లి నుంచి ఈడేపల్లి వరకు రంగా, వెంకన్నబాబు అభిమానులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ, మాజీ ఎమ్మెల్సీ విఠలరావు, సర్పంచ్ అబ్బినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వంగవీటి రంగా అందరివాడు

కైకలూరు: తన తండ్రి దివంగత వంగవీటి మోహన రంగా అందరివాడని ఆయన కుమారుడు వంగవీటి రాధా అన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలపాడులో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. రాధా మాట్లాడుతూ ఆయన దూరమయ్యి మూడున్నర దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ విగ్రహాల ఏర్పాటుతో అభిమానం చూపడం తన అదృష్టమన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ విఠల్‌రావు పాల్గొన్నారు.

బిషప్ జగనన్నకు సత్కారం



గుడివాడరూరల్: బిషప్ జగనన్నని గుడ్‌మెన్‌పేటకు చెందిన దైవ సేవకులు ఆదివారం సత్కరించారు. స్థానిక గుడ్‌మెన్‌పేటలోని బైపాస్‌రోడ్డులో పాస్టర్ కందుల రాజు ప్రార్థన మందిరంలో డాక్టర్ వేశపోగు విజయబాబు ఆధ్వర్యంలో బిషప్‌గా నియమితులైన జడ జగనన్నను ఆ ప్రాంతానికి చెందిన పలువురు దైవ సేవకులు అభినందించారు.

ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువు!

ఎన్నికల హామీని నెరవేర్చని చంద్రబాబు

గుడ్లవల్లేరు: స్త్రీ శక్తి పేరిట మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం తమ కడుపు కొట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్లుగా ఆటో తోలుకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్న ఆటో వర్కర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కిరాయిలు లేక ఆటోలను ఇళ్ల వద్ద పెట్టుకుంటున్నారు. దీంతో ఆ ఆటోలకు చెల్లించాల్సిన ఈఎంఐలు కట్టలేకపోవటంతో ఫైనాన్షియర్లు ఆటోలను వెనక్కి తీసుకునే అవకాశం ఉందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావటం లేదని ఆందోళనకు గురవుతున్నారు.

చంద్రబాబు మోసం

ఓట్ల కోసం ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడుకే దక్కింది. అన్ని వర్గాలకు ఇష్టారాజ్యంగా హామీలు ఇవ్వడం, అధికారం వచ్చిన తర్వాత వాటిని అటకెక్కించడం బాబుకు పరిపాటిగా మారింది. ప్రజలను పదే పదే మోసం చేయడంలో తనకు తానే సాటి అని ప్రతిసారి చంద్రబాబు నిరూపించుకుంటున్నారని ఆటో వర్కర్లు ఆరోపిస్తున్నారు.

తీరు మారని బాబు..

2014లో 600కు పైచిలుకు హామీలు ఇచ్చి, మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. 2024లోనూ అదే రీతిలో హామీలు ఇచ్చి తనదైన శైలిలో ఎగనామం పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే వివిధ పథకాలతో పాటు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు సాయం అందిస్తామని బాబు హామీ ఇచ్చారు. గుడ్లవల్లేరు మండలంలో వాహన మిత్ర పథకం ద్వారా 2019 నుంచి 2023 వరకు 2,534మంది లబ్ధిదారులకు రూ.12.67కోట్ల సాయాన్ని గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రక రకాల పేర్లతో అపరాధ రుసుం విధిస్తూ తమపై బాదుడే బాదుడు కార్యక్రమాన్ని చేపట్టారని ఆటో కార్మికులు వాపోతున్నారు.



గుడ్లవల్లేరు ర్యాలీలో ఆటోలు



గుడ్లవల్లేరులో ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు (ఫైల్)

కూటమి వచ్చి ఏడాది గడిచినా..



కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోతున్నా మాకు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటి వరకూ ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం కింద పథకానికి ఒక్క రూపాయి కూడా బాబు కేటాయించలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రూ.15 వేలు సాయం అందించాలి.

– బోడపాటి జోషి, ఆటో కార్మికుడు

ఆటో కార్మికులను ఆదుకోవాలి



అసలే కిరాయిలు లేక పోవడంతో ఈఎంఐలు కట్టుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో మూలిగే నక్క మీద తాటికాయలా ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశ పెట్టారు. మహిళలు ఎవరూ ఆటోలను ఎక్కటం లేదు. కిరాయిలు పూర్తిగా పడిపోయాయి. ప్రభుత్వమే మా ఆటో కార్మికులను ఆదుకోవాలి.

– లుక్కా కొండ, ఆటో కార్మికుడు

చవితి సందడి ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): వినాయక చవితి సమీపిస్తున్న తరుణంలో మొవ్వ మండలం కూచిపూడిలో తయారైన వినాయకుని విగ్రహాల తయారీ కేంద్రంలో సందడి వాతావరణం చోటు చేసుకుంది. అడుగు విగ్రహం దగ్గర నుంచి 10 నుంచి12 అడుగుల విగ్రహాల వరకు రాజస్థాన్ కళాకారులు తయారు చేశారు. ఉత్సవాల నిర్వాహకులు అడ్వాన్స్ ఇచ్చి విగ్రహాలను బుక్ చేసుకుంటున్నారు. మండలం నుంచే కాకుండా ఘంటసాల, పమిడిముక్కల మండలాలతోపాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా కొనుగోలుదారులు తరలి వస్తుండడంతో ఆదివారం విగ్రహాల తయారీ కేంద్రం సందడిగా మారింది.

వివాదాస్పద మెసేజ్‌లు పెడితే చర్యలు

పెదపారుపూడి: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల్లో ఎవరైనా సోషల్ మీడియా ద్వారా వివాదాస్పదమైన మెసేజ్‌లు పెట్టితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చవితి పండుగ పురస్కరించుకుని కమిటీ సభ్యులు ఉత్సవ విగ్రహాల ఏర్పాటుకు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు.

కుంగిపోయిన నెప్రోలి వంతెన

నందివాడ: నందివాడలో శిథిలావస్థకు చేరిన నెప్రోలి వంతెన ఆదివారం కుంగిపోయింది. దోసపాడు చానల్ నుంచి ఈ కల్వర్టు ద్వారానే నెప్రోలి పరివాహక ప్రాంతంలో 15 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది. నెప్రోలి వంతెన కూలిపోవడంతో సాగునీటి సమస్యలు ఎదురవుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా మండలంలోని అత్యధిక గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఈ రహదారి ప్రధాన మార్గం. ప్రస్తుతం ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అవంతరాలు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తొలుత తాత్కాలికంగా వంతెన నిర్మించాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



కుంగిపోయిన నెప్రోలి వంతెన

బాలు విగ్రహం కనపడకుండా బ్యానర్ల ఏర్పాటు

పోలీసుల తీరుపై పెదవి విరుస్తున్న గాయకులు

గుడివాడరూరల్: ఎంతో మందికి తన గానామృతంతో ఆకట్టుకుని ఆనంద పరవసులను చేసిన గాన గంధర్వుడు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని టూటౌన్ పోలీసులు కనపడకుండా బ్యానర్లు ఏర్పాటు చేయడంపై సంగీత, నేపథ్య గాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రాజబాపయ్య చౌక్‌లో దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహం కింద భాగంలో పట్టణ కళాకారులు, కళాకారుల సమాఖ్య సభ్యులు దివంగత బాలు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో టూటౌన్ పోలీసులు వినాయక చవితి సందర్భంగా పందిళ్ల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇటీవల బ్యానర్లు ఏర్పాటు చేయడంలో పైన ఉన్న ఘంటసాల విగ్రహం కనబడుతుండగా బాలు విగ్రహం కనబడకుండా పోయిందని కళాకారులు, గాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టూటౌన్ పోలీసులు స్పందించి బాలు విగ్రహం ప్రజలకు కనిపించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం కనబడకుండా పోలీసులు ఏర్పాటు చేసిన బ్యానర్లు

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

కలిదిండి(కై కలూరు): ఇరిగేషన్ భూముల్లో ఉంటున్న వారికి జీఓ 30 ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భాస్కరరావుపేటలో నివాసితులతో సంతకాల సేకరణ ఆదివారం చేశారు. ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాలు నుంచి పెదలంక రెవెన్యూ డివిజన్‌లో మూలలంక, భాస్కర్ రావుపేట, సంతోషపురం గ్రామాల్లో వందలాది కుటుంబాలు వలస వచ్చి స్థిర నివాసాలు ఏర్పరచుకున్నాయన్నారు. వీరికి పంచాయతీ రోడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించిందన్నారు. ఇరిగేషన్ భూముల్లో ఉంటున్నారనే కారణంతో ఇంతవరకు పట్టాలు మంజూరు చేయలేదన్నారు. కొందరికి పొజిషన్ సర్టిఫికెట్స్ ఇచ్చారని, వాటిని కూడా నిలుపుదల చేయడంతో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం వర్తించక ఇల్లు నిర్మించుకునే పేదలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూలలంక, భాస్కరరావుపేట, సంతోషపురం గ్రామాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేసి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తున్నామన్నారు.



భాస్కరరావుపేటలో ఇళ్ల పట్టాల కోసం సంతకాలు చేస్తున్న నివాసితులు

పొలిమేర వాగులో కదలని మురుగు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం, అల్లాపురం గ్రామాల మధ్య ఉన్న పొలిమేర వాగు పూర్తిగా పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారంతో నిండిపోయింది. దీంతో వాగులో మురుగునీటి పారుదల ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీనివల్ల మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడదతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఈ రెండు గ్రామాల మధ్య సుమారు కిలోమీటర్ పొడవునా పొలిమేర వాగు విస్తరించి ఉంది. రమణమ్మ చెరువు నుంచి వర్షం నీరు ఈ వాగు ద్వారా ఏలూరు కాలువ దిగువన ఉన్న డ్రెయిన్‌లో కలుస్తుంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ వాగులో పూడికలు తొలగించకపోవడంతో పాటు ఆక్రమణలకు గురై కుదించుకు పోయింది. పిచ్చిమొక్కలు, పచ్చగడ్డి దట్టంగా పెరిగిపోవడంతో వాగు రూపురేఖలను కోల్పోయింది. ఇళ్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారం పడవేయడంతో వాగు పూర్తిగా పూడుకుపోయింది. దీని వల్ల మురుగునీటి పారుదల సక్రమంగా జరగకపోవడంతో మురుగునీరు పారుదల కావటం లేదు. దోమల ఉత్పత్తి కేంద్రంగా కూడా వాగు మారిందని పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరు గ్రామాలకు చెందిన పాలకులు, అధికారులు స్పందించి పొలిమేర వాగు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన పొలిమేర వాగు

30న మండల పరిషత్ సమావేశం

పమిడిముక్కల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోలి రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సభ్యులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ.శ్రీనివాసరావు తెలిపారు. పల్లెవాడ సబ్ స్టేషన్ పరిధిలో పల్లెవాడ, అలపాడు, సోమేశ్వరం గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కలిదిండిలో..

కలిదిండి(కైకలూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా 33/11 కేవీ కోరుకొల్లు సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ కోరుకొల్లు, ఎస్ఆర్‌పీ అగ్రహారం ఫీడర్‌కు విద్యుత్ సరఫరా సోమవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిలిపివేయనున్నారు. ఈ మేరకు గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు

మండవల్లి: సంప్రదాయ పద్ధతిలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు పేరిచర్ల రామరాజు పేర్కొన్నారు. మండవల్లిలో ఆదివారం మండల గణేష్ ఉత్సవ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వినాయక మండపాల ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మండల కమిటీని సంప్రదించాలని సూచించారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గుడివాడ చిట్టిబాబు, అధ్యక్ష ఉపాధ్యక్షులుగా లంకిశెట్టి వెంకట చలపతిరావు, కఠేంటి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా నల్లా వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యర్రంశెట్టి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేపు ఆలయ హుండీ కానుకులలెక్కింపు

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్ల ఆలయ హుండీల లెక్కింపు మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సీహెచ్. హరి దుర్గానాగేశ్వరరావు తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల భక్తులు సాంప్రదాయ దుస్తులలో లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

మృతులకు నివాళులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాక, కోడూరు గ్రామాల్లో మృతి చెందిన వారి మృతదేహాలకు వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆదివారం నివాళులర్పించారు. వైవాకకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నగుళ్ల రాంబాబు తండ్రి వెంకటేశ్వరరావు, కోడూరుకు చెందిన పార్టీ నాయకుడు అడుసుమిల్లి సురేష్ సతీమణి కస్తూరిబాయి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న డీఎన్నార్, ఎంపీపీతో పాటు పార్టీ నాయకులు వారి నివాసాలకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన గాజుల అలంకరణ



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ముగ్గురమ్మలకు గాజుల అలంకరణ ఆదివారంతో ముగిసింది. శ్రావణమాసం పురస్కరించుకుని భక్తుల సహకారంతో అమ్మవారిని, గర్భాలయాన్ని గాజులతో అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన ఈ గాజుల అలంకరణను తిలకించేందుకు గత మూడు రోజులుగా గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం సందర్భంగా గత నెల రోజులుగా ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో వ్రతాలు ఆచరించారు. పలువురు మహిళలు పాలపొంగళ్లు భక్తిశ్రద్ధలతో సమర్పించారు.

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి



గుడివాడలో వినాయక విగ్రహ ఏర్పాట్ల పందిళ్లను పరిశీలించిన అధికారులు

గుడివాడరూరల్: వినాయక చవితి వేడుకలకు కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని టూటౌన్ సీఐ కె.హనీష్ పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక విగ్రహాల పందిళ్లను రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, ఫైర్ అధికారులతో కలసి ఆదివారం సీఐ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని కమిటీ సభ్యులకు ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఘర్షణలు, గొడవలకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



మాట్లాడుతున్న గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు

ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

నందివాడ: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకునే వారు ముందుగా కమిటీలను ఏర్పాటు చేసుకొని, ఉత్సవాల బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ, విద్యుత్, పోలీస్ శాఖల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ఎస్ఐ కే. శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు నైపుణ్యాలను అందిస్తాం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఆదివారం చెన్నైకి చెదిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో మోబిలైజేషన్ క్యాంప్ జరిగింది. క్యాంప్ ప్రారంభించిన కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు నైపుణ్యాలను అందిస్తామన్నారు. ముఖ్యంగా వీఎల్ఎస్ఐ అండ్ డిజైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్ వంటి రంగాల్లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేందుకు గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేషనల్ పాలసీ ఆన్ ఎలక్ట్రానిక్స్, ఇండియా సెమికండక్టర్ మిషన్‌కు అనుగుణంగా కార్యక్రమం రూపొందించ బడిందన్నారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. 150 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో ఉచితంగా నమోదు చేసుకున్నారు. ఈ కోర్సులకు గాను రూ.24,500 ఖర్చు అవుతుందని, అయితే ఉచితంగా విద్యార్థులకు అందించడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఐఐటీ మద్రాస్ నిపుణులచే 30 రోజుల హ్యాండ్- ఆన్ ట్రైనింగ్ కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఇది విద్యార్థుల కెరీర్‌కు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సీనియర్ కన్సల్‌టెంట్ వై.రామ్మోహనరావు, హెడ్ అండ్ సీఈవో, డేటా వ్యాలీ ఆర్గనైజేషన్ కె.మురళి క్యాంప్ ప్రాముఖ్యతను వివరించారు.



కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు

ఏపీ హైకోర్టు ఆన్‌లైన్ ఎగ్జామ్‌కు 378 మంది హాజరు

పెదన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆన్‌లైన్ ఎగ్జామ్‌కు 378 మంది హాజరయ్యారని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ పి.అశోక్ కుమార్ తెలిపారు. మూడు సెషన్స్‌లలో జరిగిన ఈ పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మొదటి సెషన్‌లో 180 మందికి గాను 124 మంది, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 126 మంది హాజరయ్యారన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగిన మూడో సెషన్‌లో 180 మందికి గాను 130 మంది హాజరయ్యారని, మొత్తం మూడు సెషన్లకు 540 మందికి గాను 378 మంది హాజరయ్యారని, 162 మంది గైర్హాజరయ్యారని వారు తెలిపారు.

